**స్నేహాన్ని, అభిమానాల్ని, ప్రేమను దేనితో కొలుస్తారు?**
**ఆర్థిక విలువలు మానవ సంబంధాల్ని పాడుచేస్తాయా?**

3

"నీవూహ కరెక్టే శశాంకా. నేను బిజినెస పని మీద వొచ్చాను"

"అంటే...?"

"క్రిందటి సంవత్సరం మాకు చాలా లాభాలొచ్చాయి. ఈ ఊళ్ళో కూడా ఒక బిజినెస్ పెట్టాలనుకుంటున్నాను".

ఆ మాట వినగానే శశాంక, ప్రభాకర్ ఆసక్తిగా అతని వేపు చూశారు.

"ఏం బిజినెస్?" ఆత్రంగా అడిగాడు ప్రభాకర్.

"ఇంకా ఏం ఆలోచించలేదు. నేను యాభై లక్షలు పెట్టుబడి పెడతాను. ఇంకెవ్వరైనా కలిస్తే ఇంకో యాభై లక్షలు. మొత్తం కోటి రూపాయిల పెట్టుబడితో మొదలు పెడదామనుకుంటున్నాను"

"ఏమిటి కిరీటీ? నీ వంతు యాభై లక్షలా?" ఆపైన ప్రభాకర్‌కి నోట మాట రాలేదు.

"రెండేళ్ళల్లో మనం పెట్టిన డబ్బు అంతా వచ్చెయ్యాలి. మరో రెండేళ్ళల్లో మనం పెట్టిన దానికి రెట్టింపు రావాలి. అదే నా లక్ష్యం" అన్నాడు కిరీటి.

అతని మాటలు వింటూ - 'కిరీటి అనుకున్నది తప్పక సాధిస్తా'డని

నవలిక

# నీలి మేఘం

## నందం రామారావు

అనుకున్నారు శశాంక, ప్రభాకర్.

"మీరెలాగూ బిజినెస్ మనుషులే కాబట్టి ఇక్కడ మీ సలహా తీసుకుందామని వచ్చాను"

"అలాగే. ఇంకా వుంటావు గదా. ఆలోచిద్దాం" అన్నాడు శశాంక.

కిరీటి బద్ధకంగా ఆవలించాడు.

అది చూసి శశాంక-'కిరీటీ! కాస్సేపు పడుకో" అంటూ లేచి మంచం మీదున్న దుప్పటి సరి చేసి వచ్చాడు.

కిరీటి లేచి వెళ్ళి దాని మీద పడుకున్నాడు.

"శశాంకా! నేను వెళ్ళి భోజనం చేసి వస్తారా?" అంటూ ప్రభాకర్ లేచాడు.

"మళ్ళీ ఇంటికి వెళ్ళడం దేనికిరా. ఇక్కడే భోజనం చేద్దువుగాని రా" అంటూ ప్రభాకర్‌ని క్రిందికి తీసుకొచ్చాడు శశాంక.

ప్రభాకర్ భోజనం చేస్తున్నాడు. శశాంక అతని ప్రక్కన కూర్చున్నాడు. ఇద్దరి మనస్సుల్లోనూ కిరీటి చెప్పిన మాటలే మెదుల్తున్నాయి.

'కిరీటి ఈ వూళ్ళో కొత్త బిజినెస్ పెట్టబోతున్నాడు. తను కూడా దానిలో పెట్టుబడి పెడితే...కిరీటి చాలా తెలివి గలవాడు. పదేళ్ళల్లో బిజినెస్‌లో లాభాలు గడించి కోటీశ్వరుడయ్యాడంటే మాటలా? తాము, తండ్రులు గడించిన ఆస్తులనే పెంచలేకుండా వున్నారు. కిరీటితో చేయి కలిపితే తను కూడా కోటీశ్వరుడవుతాడు. కానీ ఇందులో ఇతరు లెవ్వరూ చేరకూడదు. తాను, కిరీటి- అంతే. రెండో వాడికి తెలియకుండా చేరాలి. కిరీటిని కూడా చెప్పవద్దనాలి!

ఇద్దరూ ఎవరికివారు మూడో కంటివాడికి తెలియకుండా కిరీటి పెట్టబోయే బిజినెస్‌లో చేరాలని ఆత్రుత పడసాగారు!

** ** ** **

కిరీటి నిద్రలేచేసరికి మూడు గంటలయింది.

శశాంక కిరీటికి బిస్కెట్లు, టీ తెచ్చిచ్చాడు.

"ఇంతమంది నౌకర్లుంటే నువ్వే తీసుకురావాలా!" కిరీటి అడిగాడు.

"నా స్నేహితుడికి నా చేతుల్తో ఇస్తేనే నా కానందం"

శశాంక మాటలకు కిరీటి నవ్వాడు.

టీ తాగాక, కిరీటి ముఖం కడుక్కుని వొచ్చి-

"నా సూట్‌కేస్ తెప్పించావా?" అనడిగాడు.

"లేదు. ఇప్పుడే తెప్పిస్తాను"

"వద్దులే. నేనే వెళ్ళి తెస్తాను"

"ప్రభాకర్, నిన్ను తన కంపెనీకి తీసుకెళ్ళాలనుకుంటున్నాడు"

"అలాగా. నేను రెడీ. వెడదాం పద".

"నా డ్రెస్ వేసుకుంటావా?"

"ఎందుకు ఇది బాగానే వుందిగా"

కిరీటి తల దువ్వుకుని, సోఫా మీద వున్న కోటు చేతిలోకి తీసుకుని-

"ప్రభాకర్ ఏడీ!" అని శశాంకను అడిగాడు.

"క్రింద వున్నాడు"

"పద"

ఇద్దరూ మెట్లు దిగి వస్తుంటే రేఖ ఎదురొచ్చింది.

"అంకుల్! ఎక్కడికో బయలుదేరినట్లున్నారే" అంది నవ్వుతూ.

"అవునమ్మా. ప్రభాకర్ ఫ్యాక్టరీ చూడ్డానికి వెడుతున్నాం. నువ్వూ వస్తావా?"

"నేను రాను. కానీ అంకుల్ ఒక విషయం. మీ గురించి మా ఫ్రెండ్సందరికీ చెప్పాను. వాళ్ళందరూ మిమ్మల్ని చూడాలనుకుంటున్నారు" అంది రేఖ.

"ఎందుకమ్మా నన్ను చూడ్డం. నే నేమన్నా సినిమా స్టార్‌నా"

"కాదంకుల్. మీరు స్వశక్తితో పైకి వచ్చి కోటీశ్వరులయ్యారు. మిమ్మల్ని ఇంటర్వ్యూ చేయాలని మా కోరిక" ఆ మాట అంటూంటే రేఖ కళ్ళు తళుక్కున మెరిశాయి.

కిరీటి నవ్వి ఏదో చెప్పబోతుండగా,

"ఏం అంకుల్? మీ కిష్టం లేదా?" అని అడిగింది రేఖ.

"ఇష్టమే. అది సరే గానీ, నేను స్వశక్తితో పైకి వచ్చానని నీకెలా తెలుసు?" కిరీటి ఎదురు ప్రశ్న వేశాడు.

రేఖ చిరునవ్వు నవ్వింది. నవ్వి-

"నాకు తెలుసు" అంది.

"ఎలా?"

"మా అన్నయ్య గ్రూపు ఫోటో నా దగ్గరుంది. ఒకసారి అందులో వున్న స్టూడెంట్స్ గురించి చెబుతూ మీ గురించి కూడా చెప్పాడు. దాన్ని బట్టి నే నూహించాను అంది.

"మీ అన్నయ్య నా గురించి ఏం చెప్పాడు? నువ్వేం వూహించావ్?" అని రేఖని అడగాలనిపించింది కిరీటికి. కానీ, అది సమయం కాదని వూరుకున్నాడు.

రేఖ జ్ఞాపక శక్తికి, ఆమెకు తన మీద ఏర్పడిన గౌరవానికి ముగ్ధుడయ్యాడు కిరీటి.

"అంకుల్ రేపు ఈవెనింగ్ వాళ్ళని 'టీ'కి పిలుస్తాను. మీరు వుంటారు కదూ?" అంది.

"తప్పక వుంటాను" మనస్ఫూర్తిగా అన్నాడు కిరీటి.

"థాంక్యూ అంకుల్" అంది రేఖ సంతోషంగా.

కిరీటి ఏదో చెప్పబోయాడు. ఇంతలో శశాంక వొచ్చి- "కిరీటీ! రా వెడదాం. టైమవుతోంది. అయిదు దాటితే వర్కర్లు వెళ్ళిపోతారు" అన్నాడు.

"రేఖా! వెళ్ళొస్తాను" అని చెప్పి శశాంక వెంట బయటకు నడిచాడు కిరీటి.

కిరీటిని చూసి కారు డోర్ తీసి పట్టుకున్నాడు ప్రభాకర్.

కిరీటి కూర్చున్నాడు. అతని ప్రక్కన శశాంక కూర్చున్నాడు. డ్రైవింగ్ సీట్‌లో ప్రభాకర్ కూర్చున్నాడు.

ఇరవై నిముషాల్లో కారు ఫ్యాక్టరీ ముందు ఆగింది. ప్రభాకర్ వాళ్ళని లోపలకు తీసుకెళ్ళాడు.

కిరీటి ప్రక్కనే నిలబడి అన్నీ వివరించి చూపాడు ప్రభాకర్.

ఫ్యాక్టరీ అంతా చూసేసరికి రెండు గంటలు పట్టింది. ఆ తర్వాత శశాంక తనకు తెలిసిన ఇద్దరు - స్నేహితుల దగ్గరకు కిరీటిని తీసుకెళ్ళాడు. కిరీటి పెట్టబోయే బిజినెస్ విషయంలో వాళ్ళకు తోచిన సలహాలు ఇచ్చారు.

కిరీటి మౌనంగా విని ఊరుకున్నాడు.

ఆ తర్వాత ముగ్గురు "రిడ్జ్' హోటల్ కెళ్ళి భోజనం చేశారు.



నీలి మేఘం

మధ్యలో ప్రభాకర్ అడిగాడు-

"కిరీటీ! ఎవరెవరిని షేర్ హోల్డర్స్‌గా పెట్టుకుంటున్నావు?"

"ఇంకా ఏం అనుకోలేదురా"

"పోనీ బిజినెస్ గురించైనా ఆలోచించావా?"

"ఆ"

"ఏమిటది"

"ఏదైనా స్పేర్ పార్ట్స్ తయారు చేసే ఫ్యాక్టరీ పెట్టాలనుకుంటున్నాను"

"గుడ్ అయిడియా" ప్రభాకర్ మెచ్చుకున్నాడు.

శశాంక ప్రభాకర్ వేపు అదోలా చూశాడు.

అది గమనించి కిరీటి మనసులో నవ్వుకున్నాడు.

"నాకు ఇద్దరు ముగ్గురు షేర్ హోల్డర్స్‌ని పెట్టుకోవడం ఇష్టం లేదురా ప్రభా" అన్నాడు కిరీటి 'రా' దగ్గర నొక్కుతూ.

"అలాగే కిరీటీ! నీ ఇష్టం" అన్నాడు ప్రభాకర్.

శశాంక ఏదో ఆలోచిస్తున్నట్టు వుండిపోయాడు.

భోజనం పూర్తయ్యాక ముగ్గురూ వొచ్చి కారులో కూర్చున్నారు.

"శశాంకా! నా సూట్ కేసులు తెచ్చుకుంటాను. సరోవర్ హోటల్‌కి పోనివ్వు" అన్నాడు కిరీటి.

"అలాగే"

కారు హోటల్ సరోవర్ ముందు ఆగింది.

ముగ్గురూ కలిసి కిరీటి రూమ్ దగ్గరకెళ్ళారు. కిరీటి రూమ్ తాళం తీసి లోపలి కొచ్చాడు. ప్రభాకర్, శశాంక కూడా లోపలికొచ్చారు.

కిరీటి టేబుల్ మీదున్న సూట్‌కేస్ తాళం తీశాడు. దానిమూత తియ్యగానే వాళ్ళిద్దరి కళ్ళూ జిగేల్ మన్నాయి. ఆ సూట్ కేస్ నిండా నోట్ల కట్టలు.

కిరీటి ఆ నోట్లను అటూ ఇటూ కదిపి చూసుకుని- "ఏదైనా వూరు వెడితే చేతిలో కనీసం లక్ష రూపాయిలైనా లేనిదే నాకు తోచదురా. ఇక్కడ కొత్త బిజినెస్ పెట్టాలనుకుంటున్నాను గదా ఏ అవసరం వస్తుందోనని అయిదు లక్షలు తెచ్చాను" అన్నాడు.

ఆ మాటతో ప్రభాకర్‌కి కిరీటి మీద పూర్తి నమ్మకం కలిగింది. కిరీటి మీద రెట్టింపు గౌరవం పెరిగింది శశాంకకు.

కిరీటి మరో సూట్‌కేస్ తెరిచి పరుపు మీద పడున్న తన బట్టలు తీసి దాన్లో పెట్టుకోబోయాడు.

ప్రభాకర్, కిరీటిని వారించి-

"నువ్వెందుకురా కిరీటీ నేను సర్దుతాను" అన్నాడు.

వెంటనే శశాంక అందుకుని-

"అవున్రా కిరీటీ! నువ్వలా కూర్చో. నే నున్నాను కదా" అన్నాడు.

వాళ్ళ అతి మర్యాదలు చూసి కిరీటి నవ్వుకున్నాడు.

"మీ నక్క వినయాలు దేనికో నాకు తెలుసురా" అనుకున్నాడు.

శశాంక, ప్రభాకర్ సూట్ కేస్ సర్దారు. లిఫ్ట్‌లో క్రిందికి వొచ్చిన తర్వాత, ప్రభాకర్ హోటల్ బిల్లులు చెల్లించారు.

ముగ్గురూ కారులో కూర్చున్నారు.

శశాంక కారుని ముందుగా ప్రభాకర్ ఇంటి ముందు ఆపాడు. ప్రభాకర్ కారు దిగి, కిరీటి వేపు చూసి-

"రేపు కలుస్తారా" అన్నాడు.

కిరీటిని ఆ రాత్రి తన ఇంటికి తీసుకెళ్ళాలని వుంది ప్రభాకర్‌కి. శశాంకా, తనూ స్నేహితులైనా ఇద్దరూ వ్యాపారస్తులే. ఇప్పుడు కిరీటి తామిద్దరి కంటే గొప్ప వ్యాపారస్థుడు. అటువంటి వ్యక్తిని శశాంక కంటే ముందుగా తాను మచ్చిక చేసుకోవాలి. కానీ కిరీటి ముందుగా వచ్చింది శశాంక దగ్గరకు. ఈ రోజు కిరీటి శశాంక దగ్గర వుండక తప్పదు. పోనీ రేపు... రేపు కిరీటికి తను ఆతిథ్యమివ్వాలి. అంతే కాదు, కిరీటి బిజినెస్‌లో పార్ట్‌నర్‌గా చేరాలి'

"వస్తా కిరీటీ" అన్నాడు ప్రభాకర్.

"అలాగే. గుడ్ నైట్".

శశాంక కారు స్టార్ట్ చేశాడు.

కారు పావు గంటలో శశాంక ఇంటి ముందు ఆగింది.

** ** ** **

రాత్రి పదకొండు గంటల సమయం.

కిరీటి మంచంమీద పడుకుని వున్నాడు.

ఏ.సి.రూమ్.


డన్‌లప్ బెడ్.

చక్కటి ఫారిన్ ఇంటిమేట్ సువాసన.

కిరీటికి నిద్ర రావడంలేదు.

తనీవూరొచ్చి అప్పుడే ఒక రోజు గడిచింది.

ఇంకా రెండు రోజులుండాలి తను.



శశాంక, ప్రభాకర్ ధోరణి చూస్తుంటే తనకు చాలా ఆశ్చర్యంగా వుంది. ఆ ఇద్దరూ అంత ఆప్యాయంగా ఎలా మాట్లాడగలుగుతున్నారు. వాళ్ళలో కొద్దిగానైనా సంకోచం, సిగ్గూ కనిపించడంలేదు. వీళ్ళని చూస్తుంటే కోపం, అసహ్యం కలుగుతున్నాయి. వీళ్ళకి తగిన ప్రాయశ్చిత్తం చెయ్యాలి. వీళ్ళు ఏడుస్తుంటే తను నవ్వుకోవాలి. కాని ఎలా?

ఇంతలో కాలింగ్ బెల్.

కిరీటి తలుపువేపు చూశాడు.

తలుపు మెల్లగా తెరుచుకుంది.

కిరీటి తలక్రింద రెండు చేతులూ పెట్టుకుని చూడసాగాడు.

అతడూహిస్తున్నట్టు శశాంక కాదు.

తెల్లని ఫారిన్ నైలెక్స్ చీర రెపరెపలాడింది.

కిరీటి కళ్ళు పెద్దవి చేసుకుని చూశాడు.

తెల్లటి చీర మెల్లమెల్లగా కదిలి ముందుకు వస్తోంది.

బ్లూ బెడ్ లైట్ వెలుగులో ముఖం సరిగ్గా కనిపించడం లేదు.

కిరీటి చటుక్కున లేచి కూర్చున్నాడు.

ఆ రూపం దగ్గరయింది.

కళ్ళు చికిలించి చూశాడు.

ఎవరది?

మాల... మాలతి!

మైగాడ్.

మంచంమీద నుంచి దిగ్గున లేచి నిలబడ్డాడు కిరీటి.

ఇంతలో మాలతి అతనికి దగ్గరగా రానే వచ్చింది.

ఆమె వేపు ఆశ్చర్యంగా, అయోమయంగా చూశాడు.

తెల్లటి చీర, స్లీవ్‌లెస్ బ్లౌజు. చార్లెస్ సువాసన.

ఎదుట వ్యక్తిని మైకంలో ముంచెత్తే అలంకరణ.

క్షణంసేపు కిరీటికి మాట రాలేదు. మెల్లగా తేరుకుని-

"మీరు... ఈ సమయంలో..." తడబడుతూ అన్నాడు.

మాలతి తియ్యగా నవ్వింది.

"ఎందుకు నిలబడ్డారు. కూర్చోండి" అంటూ అతని చెయ్యి పట్టుకుని కూర్చోబెట్టింది.

కిరీటికి ఎ.సి.రూమ్‌లో కూడా చెమటలు పట్టినట్లయింది.

మాలతి అతని ప్రక్కన కూర్చుని-

"మీకిక్కడ అంతా బాగుంది కదూ?" అంది.

"ఆ... ఆ..."

"మీ కేదైనా ఇబ్బందిగా వుంటే చెప్పండి"

కిరీటికి ఆ మాటలు వినిపించలేదు.

మాలతి ఈవేళప్పుడు తన గదిలోకి ఎందుకొచ్చింది? అని ఆలోచిస్తున్నాడు.

శశాంకకి ఈ విషయం తెలుసా!

మాలతి ఇంత చనువుగా, తనకింత దగ్గరగా ఎలా కూర్చోగలుగుతుంది?

కిరీటికి ఆమె ప్రవర్తన ఎబ్బెట్టుగా తోచింది.

"మీ బొంబే బాగుంటుందా? మా హైదాబాద్ బాగుంటుందా?" అనడిగింది మాలతి.

"ఆ... ఆ... బావుంటుంది"

అతని తడబాటుని చూసి మాలతి నవ్వింది. నవ్వి-

"మీరు చాలా అందంగా వుంటారు" అంది.

కిరీటి ఇబ్బందిగా చూశాడు.

"నేనెలా వున్నాను? బాగున్నానా" అంది జారని పైటని జారుస్తూ.

బాగా లోనెక్ పెట్టి కుట్టించిన జాకెట్టులోంచి-పొంగుతున్న అందాలు క్షణంసేపు అతని మనసుని పట్టి వూపివేశాయి.

మాలతి కొంగు సర్దుకుంది.

"మీరు మళ్ళీ రెండురోజుల్లో వెళ్ళిపోతారటగదా. మా ఇంట్లో కొన్నాళ్ళుండ కూడదూ?"

"ఊహు. నేను ఒక్క రోజు లేకపోతే లక్షల్లో నష్టం వస్తుంది".

మాలతి కళ్ళు పెద్దవి చేసింది.

"లక్షలా! ఐతే మీది చాలా పెద్ద బిజినెస్ అన్నమాట"

కిరీటి నవ్వాడు.


"మీకీ డ్రస్ చాలా బాగుందండీ" అంది అతని భుజంమీద చెయ్యి వేస్తూ.

మాలతి తన గదిలోకి ఎందుకొచ్చిందో కిరీటికి అర్థమైపోయింది. అతనికి ఆమెతో సరదాగా కాలక్షేపం చెయ్యాలనిపించింది. కోరి వచ్చిన అవకాశాన్ని ఎందుకు వదులుకోవడం?

ఆనాడు, తనని తిట్టి, హేళనగా మాట్లాడిన ఈ మాలతి ఇప్పుడు ఈ క్షణంలో తనమీద ఇంత ప్రేమ కురిపిస్తోంది!

అంతా డబ్బు మహాత్మ్యం.

"ఏమిటి ఆలోచిస్తున్నారు?" భుజం నొక్కుతూ అడిగింది.



మీరు చాలా పొట్టిగా వున్నారని అనుకుంటున్నారా ఆడవాళ్ళు?



'తమ మగవారు అన్నిట్లోనూ అధిక్యంగా వుండాలని కోరతారు స్త్రీలు— పొడుగ్గా వుండటం అన్నది, జీవితంలో ముందుకెళ్ళడానికి అవసరమైన వాట్లలో ముఖ్యమైనది.

ఇస్తున్నాం

న్యూ హైట్

వేల మందికి తప్పక పనిచేసిన ముఖ్యమైన కార్యక్రమం.

శరీర స్థితీ, పొడుగూ సరిచేసే కార్యక్రమం

మీకు తృప్తినిచ్చేలాగ పనిచేస్తుంది లేదా మీ డబ్బు వాపస్

న్యూ హైట్, మీ శరీర స్థితి, వైఖరిని బ్రహ్మాండంగా రూపొందిస్తూ మిమ్మల్ని పొడుగ్గా చేయగలిగేది— శాస్త్రీయమైన వ్యాయామం, ఆహార నియమాలకైన సలహాలు. కళ్ళముందూ చూపేలాంటి పద్ధతులు—యివన్నిటితో కూర్చిన సంపూర్ణమైన కార్యక్రమం.

న్యూ హైట్, శరీరాన్నంతటినీ పునరుజ్జీవం చేసి మీకు గ్యారంటీగా తృప్తినిస్తుంది. ప్రతి రోజూ కేవలం కొన్ని నిముషాలు, అంచెలు అంచెలుగా యిచ్చే యీ సూచనలను పాటించండి. అద్భుతమైన యీ కార్యక్రమాన్ని అనుసరించి వందలకి వందల మంది స్త్రీలూ, పురుషులూ వారి శరీర వైఖరినీ, పొడుగునూ పెంచుకున్నారు. మీరూ ఎదగచ్చిక పొడుగ్గా!

న్యూ హైట్-14 రోజులపాటు దీంతో కార్యక్రమం ఉచితం మీకు.

ఏమాత్రం యిబ్బంది లేని న్యూ హైట్, కార్యక్రమాన్ని 14 రోజుల ప్రయోగాన్ని మీరు చేసిచూసిన తర్వాత అప్పుడు మీకు గనక పూర్తిగా తృప్తి కలగకపోతే, దాన్ని అంతా తిప్పి పంపించెయ్యండి మాకు. మీకు పూర్తి సొమ్ము ముదరాయిస్తాం (హేండ్లింగ్ & పార్వర్డింగ్ ఛార్జీలు తప్ప). మిమ్మల్ని ఏ రకమైన ప్రశ్నలూ అడగం.



నలుగురిలో మెప్పు పొందటం, ప్రేమ, క్రీడారంగం, వరదా, వీటో వేటిలోనైనా సరే, ఎక్కువ పొడుగ్గా వున్నవారి విజయాన్నందుకుంటారని వినుంది. మొదటగా, మీలో ఆ సరికొత్త మార్పు రావడానికోసం, ఇప్పుడే చెయ్యండిది. పొడుగ్గా అవ్వండి; తొందరగా, ఎప్పుడూ అలాగే వుండేలా.

పొడుగ్గా అవ్వండి ఇప్పుడే!

మీ యింటి దగ్గరే ఉచితంగా మీరే చేసి చూసుకునే 14 రోజుల అవకాశం!



న్యూ హైట్ కోర్సు కొన్ని శాస్త్రీయ వ్యాయామాల సహాయంతో మరింత పొడుగు పెరగడం, ఆకృతిని సరిచేసుకోవడం అన్నదాని మీద ఒక సూచనల పుస్తకం. అది మందు గాని, మాకు గాని కాదు.

కూపన్ తీసివేయబడితే, 'న్యూ హైట్'ను మీరు రూ. 94/- వి.పి.పి. ద్వారా నేరు వద్ద నుంచి ఆర్డరిచ్చి తెప్పించుకోవచ్చును. 'న్యూ హైట్' మెహతా మహల్, 15, మేథ్యూ రోడ్, బొంబాయి-400 004.

ఈ కూపన్‌కు పోస్టు చెయ్యండి నేడే!

వీరికి పోస్టు చెయ్యండి: న్యూ హైట్ NH-224-TEL
మెహతా మహల్, 15 మేథ్యూ రోడ్, బొంబాయి-400 004.

అవును. నేను నా శరీర స్థితిని మెరుగుపరుచు మరింత పొడుగవ్వాలనుకుంటున్నాను. న్యూ హైట్, 14 రోజుల ఉచిత పరీక్షకు నాకు వెంటనే పంపించండి. నాకే గనక యిది పూర్తిగా తృప్తినియ్యకపోతే, నేను దీన్ని అంతా పూర్తిగా తిప్పి పంపించెయ్య వచ్చును. నేకట్టిన డబ్బు అంతా (హేండ్లింగ్ & పార్వర్డింగ్ ఛార్జీలు మినహా) వెంటనే వాపసు పొందటంకోసం. ప్రశ్నలు అడగకుండానే! AVP-93

సరియైన గదిలో ✓ గుర్తు పెట్టండి.

☐ నాకు రిజిష్టర్ పోస్ట్ పార్సిల్‌లో పంపండి. నేను రూ. 94/- డ్రాఫ్ట్/ఐ.పి.ఓ./యమ్.ఓ. నం. ...... తారీకు ...... పంపిస్తున్నాను. (బల్‌వర్కర్ ప్ర. లిమిటెడ్ వారి పేరు మీద)

☐ నాకు వి.పి.పి. ద్వారా పంపండి. నేను పోస్ట్‌మేన్‌కి రూ. 94/- యిస్తాను. డెలివరీ యివ్వగానే.

పేరు ______
అడ్రసు ______
పిన్ ______ సంతకం ______


## నీలి మేఘం

మాలతి స్పర్శ కిరీటిలో ఉత్సాహాన్ని పెంచింది.

"మాలతీ! నేను ఎన్నో దేశాలు తిరిగాను. కాని నీలాటి సౌందర్యవతిని ఎక్కడా చూడలేదు. ఈ వయసులో కూడా..."

అతని మాట పూర్తికాకుండానే మాలతి అందుకుంది-

"నా వయసెంతనుకుంటున్నారు? మొన్ననే ముప్ఫయ్ వచ్చాయి. మావాళ్ళు చిన్నప్పుడే పెళ్ళి చెయ్యబట్టిగానీ..."

"వ్వాట్! ముప్ఫయ్ సంవత్సరాలా! నేనింకా పాతిక దాటలేదనుకుంటున్నాను.

ఆ మాటతో మాలతి ముఖం కళకళలాడిపోయింది.

"చాల్లెండి. అంతా ఒట్టిది" అంది చిన్నగా నవ్వుతూ.

"ఒట్టిది కాదు ఒట్టు" అంటూ మాలతి చేతిమీద ముద్దుపెట్టుకున్నాడు.

మాలతి సిగ్గుతో చేతుల్తో ముఖం కప్పుకుంది.

కిరీటి మెల్లగా ఆమె చేతుల్ని తొలగించాడు.

మాలతి గభాల్న అతని భుజాలమీద వాలిపోయింది.

కిరీటి ఆమెను మరింత దగ్గరకు తీసుకుని హత్తుకున్నాడు.

ఆ తర్వాత కొన్ని నిమిషాలు నిశ్శబ్దంగా గడిచిపోయాయి.

కిరీటి లేచి మంచినీళ్ళు తాగి, మళ్ళా బెడ్‌మీద పడుకుని సిగరెట్ వెలిగించుకున్నాడు.

మాలతి అతని గుండెలమీద తలపెట్టుకుని పడుకుంది.

కిరీటికి మళ్ళీ పదేళ్ళనాటి సంఘటన కళ్ళముందు మెదిలింది.

ఆనాడు తన రూపాన్ని చూసి అసహ్యించుకున్న మాలతి ఈనాడు తనని కౌగలించుకుని తన రూపాన్ని పొగడుతోంది.

"ఏవండీ?" మాలతి చిన్నగా పిలిచింది.

కిరీటి మాలతి వీపుమీద చెయ్యివేసి తట్టి-

"ఏమిటి డియర్?" అనడిగాడు.

"మరేంలేదు. చిన్న విషయం చెప్పాలనుకుంటున్నాను"

"చెప్పు మాలా"

"మీరీ వూళ్ళో కొత్త బిజినెస్ పెడుతున్నారు కదూ?"

"అవును"

"ఆ బిజినెస్‌లో శశాంకకు 'షేరు' ఇవ్వండి"

ఆ మాట వినగానే కిరీటికి పెద్దగా నవ్వాలనిపించింది.

శశాంక లక్షలకు లక్షలు ఎలా సంపాదించాడో ఈ క్షణంలో అర్థమయింది కిరీటికి.

పాపం! మాలతి!

శశాంకని నిచ్చెన ఎక్కించడానికి మాలతి ఇలా ఎంతమందితో ప్రేమ నటించిందో? శశాంకపై ఆమెకున్న అభిమానానికి ఆనందం కూడా కలిగింది.

"ఏవండీ? కోపం వచ్చిందా?"

"ఛ. లేదు. నువ్వు కోరినట్టే శశాంకకు 'షేర్' ఇస్తాను. అంతేకాదు. ఈ కంపెనీకి శశాంకనే జనరల్ మేనేజర్‌ని చేస్తాను. ఇక్కడి బిజినెస్ అతనే చూసుకుంటాడు"

మాలతి సంతోషంతో పొంగిపోతూ కిరీటిని ఇంకా గట్టిగా కౌగలించుకుంది.

** ** **

కిరీటి కళ్ళు తెరచి చూసేసరికి బాగా ప్రొద్దెక్కింది.

ప్రక్కకు తిరిగి చూశాడు.

మాలతి కనిపించలేదు.

క్షణకాలం. రాత్రి తను పొందిన అనుభూతంతా కలలా అనిపించింది. కాని తన ప్రక్కన తలగడమీద వున్న సన్నజాజులు 'కల' కాదని చెబుతున్నాయి.

కిరీటి మాలతిని తలచుకుంటూ వుషారుగా బాత్‌రూమ్‌లోకి అడుగు పెట్టాడు. అర గంటసేపు వేడినీటితో స్నానం చేసి బయటకొచ్చాడు. డ్రస్ చేసుకుని, రూమ్ తలుపు తీసుకుని రాబోతుండగా కాలింగ్ బెల్ మోగింది.

కిరీటి తలుపు తీశాడు.

ఎదురుగా శశాంక కనిపించాడు.

"గుడ్‌మార్నింగ్ కిరీటి" అన్నాడు నవ్వుతూ.

"గుడ్‌మార్నింగ్"

"నీకోసమే చూస్తున్నా. బ్రేక్‌ఫాస్ట్ తీసుకుందాం క్రిందికి వస్తావా?"

"పద"

ఇద్దరూ క్రిందికి వచ్చారు.

మాలతి టేబుల్‌మీద ప్లేట్లు అమరుస్తోంది. అడుగుల చప్పుడు విని తలెత్తి కిరీటివేపు చూసి చిన్నగా నవ్వింది.

"కూర్చోండి మీకిష్టమని పెసరట్టు ఉప్మా చేయించాను" అంది.

"నాకిష్టమా?" కిరీటి ఆశ్చర్యంగా చూశాడు.

"అదేనండీ! తెలుగువాళ్ళకిష్టమైన టిఫెన్ అదేకదా?" అంది మాలతి.

"నువ్వు చాలా తెలివిగలదానివి మాలా" శశాంక నవ్వుతూ మెచ్చుకున్నాడు.

కిరీటి అతనివేపు చూశాడు. అతను మామూలుగానే వున్నాడు.

'రాత్రి భార్యని అతడే పంపించి వుంటాడు సందేహం లేదు. కాని తెల్లారాక ఏమీ జరగనట్టు ఇద్దరూ ఎంతో మామూలుగా వున్నారు. ఇదెలా సాధ్యం?' కిరీటికి తలచుకుంటున్న కొద్దీ ఆశ్చర్యం, అసహ్యం కలగసాగాయి.

ఎలాగో టిఫెన్ తిన్నాననిపించాడు. కాఫీ త్రాగి అక్కడ నుంచి లేచాడు. శశాంక కూడా కిరీటివెంట హాల్లోకి వచ్చాడు. కిరీటి ప్రక్కన సోఫాలో కూర్చున్నాడు. కిరీటి సిగార్ వెలిగించాడు. శశాంక ఏదో చెప్పాలనుకుంటున్నట్లుగా గమనించాడు కిరీటి. కాని గమనించనట్లు వూరుకున్నాడు. అయిదు నిమిషాలు గడిచాక శశాంక అడిగాడు-

"కిరీటి నిన్న నువ్వు చెప్పిన విషయం ఏం ఆలోచించావ్?"

"ఏమిటది?" ఏం ఎరగనట్లు అడిగాడు.

"అదే ఈ వూళ్ళో నువ్వు స్టార్ట్‌చేసే ఫ్యాక్టరీ"

"అదా ఇంకా ఏం ఆలోచించలేదు"

"అదేం?"

"ఏముంది? షేర్స్‌కోసం టెండర్ పెడదామనుకుంటున్నాను" అన్నాడు శశాంకవేపు ఓరగా చూస్తూ.

శశాంక ముఖం అదోలా అయిపోయింది. మౌనంగా వుండిపోయాడు. అది చూసి కిరీటి-

"శశాంకా! నువ్వు బిజినెస్‌లో చాలా ఆరితేరిన వాడివి. నీ సలహా లేనిదే నేనేం చెయ్యను. నువ్వెలా చెప్తే అలా చెయ్యాలనుకుంటున్నాను" అన్నాడు.

ఆ మాటలతో శశాంక మహాసంతోషపడిపోయాడు.

"నామీద ఆ మాత్రం గౌరవం వున్నందుకు థాంక్స్‌రా. నీకు నా సలహా, సహకారాలు ఎప్పుడూ వుంటాయి" అన్నాడు.

"అయితే నీ షేర్ యాభై లక్షలు" అన్నాడు కిరీటి.

ఆ మాటవిని శశాంక కంగారుపడ్డాడు.

"లేదురా కిరీటి నేనంత పెట్టలేను. పది లక్షలు పెట్టగలను"

"పది లక్షలా ఏం సరిపోతుంది. మూడో వ్యక్తిని చేర్చుకోవడం నాకిష్టం లేదు".

"అబ్బే ఎందుకురా ఇంకొకరు?"

"పోనీ ప్రభాకర్ అయితే...?"

"కిరీటి నువ్వు నాకివ్వకపోయినా ఫర్వాలేదుగాని వాడిని మాత్రం చేర్చుకోకు. వాడొట్టి లోఫర్. నిన్ను సర్వనాశనం చేస్తాడు".

కిరీటి నవ్వాడు "అలాగే. నువ్వు చెప్పినట్లే చేస్తానని చెప్పానుగదా. కాని శశాంకా పది లక్షలంటే నీ స్టేటస్‌కి చాలా తక్కువరా" అన్నాడు.

శశాంక క్షణం ఆలోచించి-

"కిరీటి నీతో అబద్ధం చెప్పడం నాకిష్టం లేదు. వున్న విషయం చెబుతున్నాను. నా దగ్గర ఇప్పుడున్న క్యాషంతా కలిపి పాతిక లక్షలు వుంటుంది. అదంతా ఇచ్చేస్తాను" అన్నాడు.

(ఇంకా వుంది)

పద్మాలయ పబ్లికేషన్స్
నవలానవమోహిని సస్పెన్స్ థ్రిల్లర్
పోటీలో రు॥3000/- బహుమతి
పొందిన నవల

శశాంక నిమీలితల మధ్య
ప్రణయం పల్లవిస్తుందా?
గోవర్ధనరావు, నిమీలిత ప్రేమ
పంజరాన్ని భగ్నం చేస్తాడా?
అవధూతేంద్ర స్వామి ఎవరు?
కుండలినీ స్వామి ఆటలు
సాగుతాయా?

దేశద్రోహుల ముఠా
ఆట కట్టించేదెలా?
దేశమును ప్రేమించుమన్నా
అన్న గురజాడ సూక్తికి
అద్దంపట్టిన
ఆనందాశ్చర్యాల అద్భుత నవల-

ప్రఖ్యాత నవలా రచయిత
డా॥ కొత్త రవీంద్రబాబు
'అమృత కలశం'
వచ్చే వారం ప్రారంభం!
nani...